పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# సమాజ శ్రేయస్సు కోసం శ్రీ మంగళ కాళీ పీఠంలో ప్రత్యేక హోమం



**విశాఖ, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :**సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ శ్రీశ్రీశ్రీ పరమేశ్వర నందగిరి స్వామిజీ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా స్వామీజీ వేదమంత్రాల నడుమ హోమం చేశారు, దేశం, రాష్ట్రం అభివృద్ధి పథం లో ముందుకు సాగాలని ప్రార్థించారు. సమాజం లో సానుకూల వాతావరణం నెలకొనాలని, ప్రతి కుటుంబం ఆనందంతో కళకళలాడాలని ఆకాం క్షించారు.హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పా ల్గొని ప్రత్యేక పూజల్లో భాగమయ్యారు. కార్యక్రమం ముగింపులో తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, ప్రజలకు ధార్మిక సందేశం అందించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో నైతిక విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని స్వామీజీ తెలిపారు.

# ఐఎన్ఎస్ డేగాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమాల్లో పాల్గొనడానికి భారత రాష్ట్రపతి మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో విశాఖపట్నా నికి చేరుకున్నారు. ఢిల్లీ నుండి భారతీయ వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో విచ్చేసిన ఆమెను విశాఖ నేవల్ ఎయిర్ స్టేషన్ అయిన వద్ద అధికార యంత్రాంగం ఘనంగా ఆహ్వానించింది. రాష్ట్రపతి రాక సందర్భంగా ఎయిర్ స్టేషన్ ప్రాంగణంలో గౌరవ వందనం నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ , ఉప ముఖ్య మంత్రి , జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యుడు ఎం.భరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో పాటు తూర్పు నావికాదళ ఉన్నతాధికారులు రాష్ట్రపతికి స్వాగతం పలికారు.

అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమాల సంద ర్భంగా రాష్ట్రపతి నౌకాదళ పరేడ్‌ను సమీక్షించ డంతో పాటు వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రాష్ట్రపతి పర్యటన నేప థ్యంలో విశాఖ నగరంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు.

# శాసనమండలిలో వైసీపీ రభసపై జనసేన ఆగ్రహం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** రాష్ట్ర బడ్జెట్‌పై సార్థక చర్చ జరగకుండా శాసన మండలిలో కావాలనే రభస సృష్టిస్తున్నారని జనసేన పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. అసెం బ్లీ మీడియా పాయింట్ వద్ద విశాఖ దక్షిణ ఎమ్మె ల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన బడ్జె ట్‌పై నిర్మాణాత్మక చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమా నికి ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్ రూపొందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా బీసీ వర్గాలకు భారీ కేటాయింపులు చేయడం, పోలవరంఅమరావ తి వంటి కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయిం చడం వంటి అంశాలు చర్చించాల్సినవని అన్నా రు.అయితే, శాసనమండలిలో సంఖ్యాబలం ఎక్కువగా ఉందనే కారణంతో వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి సమావేశాలకు అంతరాయం కలిగించడం అనుచితమని విమర్శించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించకుండా సభా సమయాన్ని వృథా చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయ కృష్ణ మాట్లాడుతూ, శాసనసభలో సమయం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ సభకు హాజరుకాని వైసీపీ సభ్యులు, శాసనమండలిలో మాత్రం చర్చకు అవకాశం ఉన్నప్పటికీ రభసకు పాల్ప డటం సరైన విధానం కాదన్నారు. ప్రజా సంక్షే మం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో బడ్జెట్ రూపొందించిందని తెలిపారు.శాసనమండలి చైర్మన్ పోడియం ఎక్కి అప్రజాస్వామికంగా ప్రవర్తించడం ఖండ నీయమని, సభా పరిపాట్లు పాటించాలని జనసేన పార్టీ తరపున కోరారు.

# వైకాపా ఇళ్ల పట్టాలపై సమగ్ర విచారణకు బీజేపీ డిమాండ్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల వ్యవహా రంపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ విశాఖ పట్నం జిల్లా నాయకత్వం డిమాండ్ చేసింది. స్థలం చూపించకుండానే ఇళ్ల పట్టాలు ఇచ్చారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.బీజేపీ విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు ఆధ్వర్యంలో పార్టీ ప్రతిని ధులు ఈ వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధి కారికి అందజేశారు. ప్రతివారం నిర్వహించే "జనతా వారిది" కార్యక్రమంలో భాగంగా ఈ వినతి సమర్పించినట్లు తెలిపారు.ఈ సంద ర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ, 2024 ఎన్ని కలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పం పిణీ చేసిన ఇళ్ల పట్టాలలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకుపైగా ఇళ్ల పట్టాలు ఇచ్చామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అనేక ప్రాంతాల్లో లబ్ధిదా రులకు వాస్తవ స్థలం కేటాయించలేదని పేర్కొ న్నారు.పట్టాలు అందుకున్న పేదలకు ఇళ్లు నిర్మించుకునే స్థలం ఎక్కడ ఉందో స్పష్టత లేకపోవడంతో పలువురు లబ్ధిదారులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలను మోసం చేసిన వారిని నిశితంగా విచారించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి సుజాత, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ విజయా నంద రెడ్డి, జనతా వారధి జిల్లా కన్వీనర్ శ్రీని వాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాడి రమే ష్, దామోదర్ యాదవ్, ఉపాధ్యక్షులు అత్తిలి శంకర్రావు, మాజీ ఉపాధ్యక్షులు కొప్పల రామ్ కుమార్, మండల అధ్యక్షుడు నాగ శివం తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో బీసీల సంక్షేమంపై

# వంశీకృష్ణ శ్రీనివాస్ గళం

### బడ్జెట్‌లో అధిక కేటాయింపులకు సీఎం, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :**రాష్ట్రంలో బీసీల సంక్షేమం, అభి వృద్ధి కార్యక్రమాలపై దక్షిణ నియోజకవర్గ ఎమ్మె ల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అసెంబ్లీలో విస్తృతంగా ప్రస్తావించారు. బీసీలు రాష్ట్రంలో అత్యధిక జ నాభా కలిగిన వర్గమని, వారి అభివృద్ధి జరిగి తేనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.గత ప్రభుత్వంలో 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరలేదని ఆయన విమర్శిం చారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలకు అండగా నిలుస్తూ, బడ్జెట్‌లో సింహభాగం కేటాయింపు లు చేయడం అభినందనీయమని తెలిపారు. బీసీలకు అధిక నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

బీసీలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా అందుతున్న స్వయం ఉపాధి రుణాలు, రాయితీలు, నిరుద్యో గులకు ఎంబీసీ, ఎఫ్‌బీసీ కారు రుణాలు వంటి పథకాలపై ఆయన వివరాలు వెల్లడించారు. స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపుల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించ డం, నాయీ బ్రాహ్మణులు మరియు చేనేత కార్మి కులకు విద్యుత్ రాయితీలు అందించడం వంటి అంశాలను ప్రస్తావించారు.అదేవిధంగా గత టిడిపి ప్రభుత్వ కాలంలో అమలు చేసిన కొన్ని ప్రత్యేక బీసీ పథకాల పునరుద్ధరణ, 'ఆదరణ' పథకం అమలు తీరుపై కూడా మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. 56 బీసీ కార్పొరే షన్లకు సంబంధించిన నిధుల మంజూరు, స్వ యం ఉపాధి అవకాశాల విస్తరణపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని ఆయన కోరారు.బీసీలకు ఆర్థిక, సామాజిక పరంగా మరింత బలోపేతం కలిగేలా ప్రభుత్వం చర్యలు కొనసాగించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## బాలి పైడిరాజు ప్రథమ వర్ధంతి

# కుటుంబానికి అండగా నిలుస్తామన్న సిరమ్మ



**బిమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :**నగరపాలక సంస్థ 34వ డివిజన్ మాజీ కార్పొరే టర్ కీర్తిశేషులు బాలి పైడిరాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఇందిరానగర్‌లో మంగళవారం స్మారక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి బాలి పైడిరాజు కుమారుడు బాలి ప్రతాప్ ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్పర్సన్, వైఎస్ ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిర మ్మ హాజరై బాలి పైడిరాజు చిత్రపటానికి పూల మాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

తన ప్రసంగంలో సిరమ్మ మాట్లాడుతూ, బాలి పైడిరాజు ప్రజాసేవలో విశేషంగా పనిచేశారని గుర్తుచేశారు. వారి సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశా రు. భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తమ వంతు సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షు డు తోట వాసు, సంస్థ సభ్యులు, స్థానిక ప్రజాప్ర తినిధులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యక ర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింహాచలం దేవస్థానంలో ఈఓ జె.వెంకటరావు ఆకస్మిక తనిఖీ

- అభివృద్ధి పనులపై కీలక ఆదేశాలు
- భక్తుల, విద్యార్థుల సౌకర్యాలపై దృష్టి

**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారి (ఈఓ) జె. వెంకటరావు మంగళవారం ఆకస్మికంగా పలు విభాగాలను తనిఖీ చేశారు. ఆలయ పరిపాలన, విద్యార్థుల వసతులు, రవాణా సదుపాయాలు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, లోపాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. వేద విద్యార్థుల వసతులపై అసంతృప్తి



ఆగమ పాఠశాల, హైస్కూల్ మరియు నాదస్వరం విద్యార్థుల వసతి ఏర్పాట్లను పరిశీలించిన ఈఓ, వేద విద్యార్థుల వంటశాల బస్టాండ్ సమీపంలో ఉండటంపై అభ్యంతరం తెలిపారు. పాఠశాల ప్రాంగణంలోనే శు భ్రమైన వంటగది ఏర్పాటు చేసి, నాణ్యమైన ఆహారం అందించాలని స్పష్టం చేశారు. అదనంగా విద్యార్థులకు మరిన్ని స్నానపు గదులు నిర్మించాలి, వ్యక్తిగత లాకర్లు ఏర్పాటు చేయాలి, తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫైయర్లు అమర్చాలి. ఈ పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఆదేశాలు ఇచ్చారు. హైస్కూల్, నాదస్వరం విద్యార్థులకు నిర్ణీత సమయానికి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వేద విద్యార్థులకు వడ్డించే అన్నప్రసాదం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. పూలతోట, నీటి సదుపాయాలపై సూచనలు శ్రీదేవి కాంప్లెక్స్ మరియు స్వామివారి కైంకర్యాలకు పూలు సరఫరా చేసే పూలతోటను పరిశీలించిన ఈఓ, నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అవసరమైతే కొత్త బోర్‌వెల్స్ త్రవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

డౌన్‌హిల్ ఆలయానికి దారి సూచికలు ఏర్పాటు

డౌన్‌హిల్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం బస్టాండ్ మరియు రహదారి ప్రారంభంలో స్పష్టమైన డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బోర్డులకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కూడా సూచించారు.

రవాణా, భద్రతా విభాగాలపై హెచ్చరిక



కార్యాలయ గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని కఠినంగా నిరోధించాలని ఈఓ హెచ్చరించారు. మరమ్మతులో ఉన్న బస్సును ఫిబ్రవరి 19లోపు అందుబాటులోకి తీసుకురావాలని, పాత వాహనాల వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని రవాణా విభాగానికి ఆదేశించారు. "దేవస్థాన ప్రతిష్టకు భంగం కలగకూడదు" ఈ సందర్భంగా ఈఓ జె. వెంకటరావు మాట్లాడుతూ, దేవస్థాన ప్రతిష్టకు భంగం కలగకుండా ప్రతి విభాగం బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. పై పేర్కొన్న అంశాలపై తక్షణ చర్యలు చేపట్టి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు మెరుగైన సేవలు, విద్యార్థులకు ఉత్తమ వసతులు కల్పించడం దేవస్థాన ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



గాజువాక :పెన్ పవర్ ,ఫిబ్రవరి 17 జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఘనంగా జీవీఎంసీ 87వ వార్డ్ పరిధిలో మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం పాల్గొని ముందుగా పాఠశాలలో ఉన్న విద్యార్థుల కు వైద్యులు నిర్దేశించిన ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు అందజేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు ఈ ఆల్బెండజోల్ మాత్రలను తప్పనసరిగా వేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రఠశాలల అభివృద్ధి కోసం పెద్దపిట వేస్తుందని అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె. ధనలక్ష్మి మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, ఆకలి మందగించడం మరియు శారీరక, మానసిక ఎదుగుదల లోపించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ మాత్రలను ఖాళీ కడుపుతో కాకుండా, భోజనం చేసిన తర్వాత వేసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా నులిపురుగుల వ్యాప్తిని అరికట్టవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్,రాజన్ రాజు, డీవీ అప్పారావు, వర్రే రాంబాబు, పావడా వెంకటరమణమూర్తి,కళ్లేపల్లి శ్రీనివాసవర్మ,జాన్ రమేష్,మజ్జి పద్మ,కోరుకొండ కళ్యాణ్ చక్రవర్తి, దాలయ్య,దేముడు, మూర్తి,ఆదినారాయణ,వైద్యులు, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


# గిరిజన ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలపై తీవ్ర వ్యతిరేకత

రింతాడ పంచాయతీ వైసీపీ అధ్యక్షుడు రామ్మూర్తి హెచ్చరిక



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 17:**అల్లూరి సీతారామ రాజుజిల్లా గిరిజన ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలపై మళ్లీ ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తల నేపథ్యంలో తీవ్ర వ్యతిరేక స్వరాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రింతాడా పంచాయతీ అధ్యక్షుడు రామ్మూర్తి ఘాటుగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. గిరిజనుల జీవనాధారం, ప్రకృతి సంపద, పర్యావరణ సమతుల్యతకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేశారు. బాక్సైట్ తవ్వకాలు ప్రారంభిస్తే గిరిజనుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని రామ్మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలంతా ఏకగ్రీవంగా తవ్వకాలకు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. గిరిజనుల హక్కులు, వారి సంప్రదాయ జీవన విధానాన్ని కాపాడేందుకు అవసరమైతే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులను దోపిడీ చేయకుండా, స్థానికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు.

## కాలబైరవుడికి మోలీ అమావాస్య సందర్భంగా మహాభిషేకం





**గాజువాక: పెన్ పవర్ ,ఫిబ్రవరి 17** జీవీఎంసీ పరిధి 65వ వార్డు వాంబే కాలనీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కాలభైరవ స్వామికి మోలీ అమావాస్య సందర్భంగా మహాభిషేకం ప్రత్యేక హోమాలు పూజలు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో జరిపించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈరోజు మోలీ అమావాస్య పితృదేవతలకు అత్యంత ప్రీతిపదమైన అమావాస్య కాలభైరవుడికి అభిషేకం హోమంలు చేయడం జరిగిందని దీనివల్ల మన పితృదేవులకు మన కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు , కలుగుతాయని స్వామివారిని కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని దృఢ సంకల్పంతో స్వామిని పూజిచేసి స్వామివారి కృపకు పాత్రులు అవుతారని అన్నారు. గాజువాక ప్రాంతంలో కాల బైరవ దేవస్థానం నిర్మించడం ఎంతో శుభదాయకమని కొనియాడారు పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామివారిని దర్శించుకుని వారి కోరిన కోరికలు తీర్చుకోవలసిందిగా ప్రజలను అభ్యర్థించారు. పూజా కార్యక్రమం రాఘవేంద్ర శర్మ సారిద్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, పెంటకోట రాజు, పప్పల ఆదిలక్ష్మి , రామకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు కాలనీ భక్తులందరూ పాల్గొన్నారు.

## జీడి మామిడి తోటలో యాజమాన్య పద్ధతిపై అవగాహన.



**గుమ్మ లక్ష్మీపురం ఫిబ్రవరి 17. పెన్ పవర్.** మండలంలో గల కె శివడ గ్రామంలో మహిళల సంఘాలతో మంగళవారం ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ కిమిడి భూషణ్ రావు ఆధ్వర్యంలో మహిళ రైతులకు ప్రకృతి వ్యవసాయ మెలుకలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భూషణ్ రావు మాట్లాడుతూ. జీడి మామిడి తోటలకు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని. పుల్లటి మజ్జిగ,పంచగవ్య,వేప నూనె,ద్రవజీవామృతం తయారు చేసుకుని పంటలపై పిచికారి చేయాలన్నారు. ఈ విధాన్ని పాటించడం వలన పుతరాలకూడ పింజ మాడిపోకుండా ఎటువంటి తెగుళ్లు సోకకుండా ఉంటుందని ఈ పద్ధతిలో చేయగలిగితే పిక్క బరువు మరియు రంగు మంచి దిగబడి సాధించవచ్చు అన్నారు. మహిళ రైతులతో సామూహికంగా పుల్లటి మజ్జిగ తయారు చేయించడం జరిగింది ఈ విధంగా అన్ని గ్రామాల్లో రైతులు అందరు తయారు చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమానికి వెలుగు సిసి సూర్యనారాయణ ఐ,సి,ఆర్,పి పాలక సంధ్య ట్రైనింగ్ ఐ.సి.ఆర్.పి బిడ్డిక స్వాతి వివోఏ హాజరయ్యారు.

# ట్రై సైకిళ్లు, డస్ట్ బిన్నులు పంపిణీ...!

పంపిణీ చేసిన ఎంపీపీ రమేష్ , మాజీ జిసిసి చైర్మన్ ఎం. వి.వి



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 17:** మండలంలోని ఉన్న 33 పంచాయితీలకు ట్రై సైకిళ్లు డస్ట్ బిన్నులు పంపిణీ చేశారు. మంగళవారం కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ బాబు, మాజీ జిసిసి చైర్మన్ ఎం. వి. వి ప్రసాద్ చేతుల మీదుగా ప్రభుత్వం అందిస్తున్న ట్రై సైకిల్లు, డస్ట్ బిన్నులు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జీడివి ప్రసాదరావు ఆధ్వర్యంలోపంపిణీ చేశారు. మండలంలోని ఉన్న 33 పంచాయతీ లకు ట్రై సైకిళ్లు, 6 డస్ట్ బిన్ లు ను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టిడిపి నేత కొట్టేటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి జనవాణి



నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర

**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 17) :**నర్సీపట్నం మున్సిపాలిటీ, రామారావుపేట జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల నుంచి ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 22 వినతులు అందినట్లు వీరసూర్యచంద్ర తెలిపారు. భూ వివాదాలు, పింఛన్లు, విద్యుత్ సరఫరా తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా లీజు ముగిసినప్పటికి మా స్థలంలో కొనసాగుతున్న బిఎస్ఎన్ఎల్ టవర్ తొలగించాలంటూ నాతవరం మండలం డి. యర్రవరంకు చెందిన అల్లు రాజేశ్వరి అనే మహిళ వినతిపత్రం అందజేశారు. దీనిపై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పింఛన్ల మంజూరు, రీ సర్వే సమస్యలు, ఆర్టీసిలో పని చేస్తు చనిపోయిన వ్యక్తికి కారుణ్య నియామకాలు చేపట్టాలని, అలాగే విద్యుత్ సరఫరా లోపాలు వంటి సమస్యలపై కూడా వినతులు అందినట్లు తెలిపారు. సంబంధిత అధికారుల తక్షణమే మాట్లాడటం జరిగిందని, ఈ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. జనవాణిలో పచ్చిన ప్రతి ఫిర్యాదుకు న్యాయం చేయడం తమ లక్ష్యమని, జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సూర్యచంద్ర పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, నర్సీపట్నం వైస్ ఎంపీపీ ఇన్నం రమణ, మండల సీనియర్ నాయకులు సత్యప్రసాద్, యర్రంశెట్టి పాపారావు, మాకవరపాలెం యూత్ అధ్యక్షులు ఎస్ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నులు పురుగుల మందులు పంపిణీ

శతశాతం పూర్తయిందని వైద్యాధికారి జగదీష్ నాయక్ వెల్లడి



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 17:** రక్తహీనత నిర్మూలించడానికి నులుపురుగు ల మందులు పంపిణీ కార్యక్రమం విజయవంతం అయ్యిందని ఎంపీడీవో జీడివి ప్రసాదరావు అన్నారు. మంగళవారం మండలంలోనూ ఉన్న గిరిజన సంక్షేమ, బాలుర బాలికల, కస్తూర్బా పాఠశాలల్లో ఒకటి నుండి 19 సంవత్సరాల విద్యార్థులకు నులుపురుగుల మందులు (ఆల్బంజల్ ) పంపిణీ కార్యక్రమం మండలంలో శతశాతం పూర్తయిందని ఎంపీడీవో ప్రసాదరావు, వైద్యాధికారి జగదీష్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జగదీష్ నాయక్ మాట్లాడుతూ... ఈ నులిపురుగుల మందులు వేసుకోవటం వలన రక్తహీనత నిర్మూలించ వచ్చునని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలిపారు. ఈ మందులను వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విద్యార్థులకు వేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం... గర్భంలోనే శిశువు మరణం



**గూడెం కొత్త వీధి,,పెన్ పవర్, ఫిబ్రవరి 17:**చింతపల్లి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గర్భంలోనే శిశువు మృతి చెందిందని బాధిత గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో నిరసన తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బాధితులు స్థానిక విలేకరులకు వెల్లడించారు. జీకేవీధి మండలం కదుగుల గ్రామానికి చెందిన సాగిన కళ్యాణి అనే మహిళ పురిటి నొప్పులు సమీపిస్తుండగా ఈనెల 5న చింతపల్లి గర్భిణీ స్త్రీల పర్యవేక్షణ హాస్టల్ నందు చేరి వైద్యుల పర్యవేక్షణలోనే ఉండింది. అయితే 15 న ఆదివారం రాత్రి పురిటి నొప్పులు ఎక్కువయ్యాయని ఆస్పత్రికి తరలించగా ప్రసవం చేయడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేశారని తెలిపారు. రెండు రోజులు ఆస్పత్రిలో విషమించే వరకూ ఉంచేశారని తెలిపారు. బిడ్డను నలిపేయడంతో పాటు ఉమ్మనీరు పూర్తిగా పోయే చివరి నిమిషం వరకు చింతపల్లి లోనే ఉంచారని, అనంతరం పరిస్థితి విషమించడంతో నర్సీపట్నం తరలించారని తెలిపారు. అక్కడి వైద్య సిబ్బంది ఆలస్యం చేయడం వల్లే గర్భంలో శిశువు మృతి చెందినట్లు చెప్పారన్నారు. చింతపల్లిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందిందని అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యుల కన్నీరు మున్నేరుగా విలపిస్తూ మా శిశువు మృతికి కారకులైన చింతపల్లి సామాజిక ఆసుపత్రి వైద్య సిబ్బందిపై అధికారులు చర్యలు చేపట్టాలని, మాకు జరిగినట్టుగా మరేఇతర కుటుంబ సభ్యులకు జరగకుండా చర్యలు చేపట్టాలని భాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఈనెల 21న మండల సర్వసభ్య సమావేశం...!

కొయ్యూరు ఎంపీడీవో జీడివి ప్రసాదరావు వెల్లడి



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 17:**
ఈనెల 21న సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో జీడివి ప్రసాదరావు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలో 33 పంచాయితీల్లో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు అందరూ విధిగా హాజరవ్వాలని ఆయన కోరారు. అలాగే మండలంలోనున్న వివిధ శాఖల మండల స్థాయి అధికారులు వారి యొక్క నివేదికతో హాజరు కాకపోయినట్లయితే వారి సమాచారాన్ని ఉన్నత అధికారులకు తెలియపరచటం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## విజ్ఞాన్ కళాశాల లో ప్రవర్తనా నైపుణ్యాలు , వ్యక్తిత్వ వికాసంపై వర్క్‌షాప్



**గాజువాక :పెన్ పవర్ ,ఫిబ్రవరి 17**
విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆటోనమస్, దువ్వాడలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం మరియు ప్రవర్తనా నైపుణ్యాల అభివృద్ధి కోసం ప్రత్యేక వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు.

వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులకు అవసరమైన ప్రవర్తనా నైపుణ్యాలు, సమర్థవంతమైన కమ్యూనికేషన్ పద్ధతులు, ఆత్మవిశ్వాస పెంపుదల వ్యూహాలు మరియు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం. విద్యా మరియు వృత్తి జీవితంలో విజయం సాధించడానికి అవసరమైన సామర్థ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా నిర్వహించామని ఈ కార్యక్రమంలో వ్యక్తులుగా డి. ఆర్ మాస్టర్ ట్రైనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. దక్షాయణి , ఎం.ఎస్.సి సైకాలజీ నిపుణుడు రవి కుమార్ వెంకట పాల్గొన్నారు. సమర్థవంతమైన సంభాషణ నైపుణ్యాలు, భావోద్వేగ మేధస్సు, నాయకత్వ లక్షణాలు, ఒత్తిడి నిర్వహణ, జట్టు సామర్థ్యం మరియు వృత్తిపరమైన ప్రవర్తన వంటి అంశాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఇంటరాక్టివ్ సెషన్లు, వాస్తవ జీవన ఉదాహరణలు మరియు ప్రాయోగిక కార్యక్రమాలు వర్క్‌షాప్‌ను ఆకర్షణీయంగా మరియు ప్రభావవంతంగా మార్చాయని తెలిపారు . ఈ కార్యక్రమం డా. ఎస్. నాగ మల్లిక్ రాజ్, డా. చ. స్వప్న ప్రియా, జి. కిశోర్ కుమార్ , ఎస్. అనూరాధ మార్గదర్శకత్వంలో నిర్వహించారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్ , రెక్టర్ డా. వి. మధుసూధన రావు , సిఎస్ఈ విభాగాధిపతులు బి. దినేష్ రెడ్డి , డా. మహంతి మోహన్ , అధ్యాపకులు అతిథులు ప్రేరణాత్మకమైన , ఆలోచనాత్మకమైన ఉపన్యాసాలు అందించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# చక్రతీర్ధ స్నానాలకు పటిష్ఠ బందోబస్తు  భక్తులకు అసౌకర్యం లేకుండా సమగ్ర ప్రణాళిక.


## శ్రీముఖలింగం చక్రతీర్ధ స్నానాల ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి.





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఫిబ్రవరి 17**. జలుమూరు మండలం శ్రీముఖలింగంలో బుధవారం జరగనున్న శ్రీముఖలింగేశ్వర స్వామి వారి చక్రతీర్ధ స్నానాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. సుమారు 1000 మంది అధికారులు, సిబ్బందితో ప్రశాంతంగా ఉత్సవం నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయబడిందని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి తెలిపారు.

మంగళవారం జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి శ్రీముఖలింగం ఆలయం, వంశధార నది మార్గం, స్నానాలు జరిగే ప్రదేశాన్ని కాలినడక ద్వారా సందర్శించి తుది ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులకు పలు ముఖ్య సూచనలు చేశారు. చక్రతీర్ధ స్నానాల రోజున స్వామివారి ఉత్సవ విగ్రహాలు వెళ్లే మార్గం, నదిలో స్నాన ఏర్పాట్లు, బారికేడ్ల నిర్మాణం, రూట్ మ్యాప్, పార్కింగ్ స్థలాలు, కంట్రోల్ రూమ్ తదితర అంశాలను ఎస్పీ గారు క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ఇరువైపులా భారీ రోపు పార్టీలు ఏర్పాటు చేసి, భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బుధవారం జరిగే చక్రతీర్ధ స్నానాలకు లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేస్తూ, ఆ మేరకు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇందుకోసం సుమారు వెయ్య మంది సివిల్, ఏ ఆర్,స్పెషల్ పార్టీ ఫోర్స్, రోప్ పార్టీ, లా & ఆర్డర్ , హోంగార్డ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని తెలిపారు. పోలీసు, రెవెన్యూ మరియు ఆలయ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించబడింది. ఉత్సవ విగ్రహాల ప్రయాణ మార్గమంతా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో ఉంచి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో చక్రతీర్ధ స్నానాలు నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. అనంతరం బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి భక్తులు స్వామి వారి స్నానాలు ఆచరించేలా అప్రమత్తంగా ఉంటూ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని,విధి నిర్వహణ లపై జిల్లా ఎస్పీ పలు అంశాలపై దిశ నిర్దేశాలు చేశారు. ఈ పరిశీలనలో అదనపు ఎస్పీలు కె.వి. రమణ, పి. శ్రీనివాసరావు, సహాయ (ట్రైనీ) కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీలు వివేకానంద, షేక్ షాహబాజ్ అహ్మద్, లక్ష్మణరావు, గోవిందరావు, శేషాద్రి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## బాల్య వివాహరహిత సమాజమే లక్ష్యం



**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 17 పెన్ పవర్.** మన్యం జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లామహిళా శిశు సంక్షేమశాఖ పిడి. డాక్టర్ టి. కనకదుర్గ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ బాల్య వివాహరహిత సమాజం కోసం కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం–లీగల్ కమ్ ప్రొబిషన్ ఆఫీసర్–పి. శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వందరోజుల స్పెషల్ ప్రోగ్రాం బాల్య వివాహ ముక్తభారత్ ప్రణాళికలో భాగంగా ఐసిడిఎస్ మరియు జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో కురుపాం మండలంలో ఏకలవ్య స్కూల్లో బాల్య వివాహాలు వల్ల నష్టాలు మరియు అనర్థాలు గూర్చి మరియు చెడు స్పర్శ మరియు మంచి స్పర్శ గూర్చి క్లుప్తంగా వివరించారు బాల్య వ్యవహారాలు చట్టరీత్యా నేరం,బాల్య వివాహాల వల్ల బాలికల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని మరియు పలువురు బాలికలు చిన్నతనంలోనే బాగా చదువుకోవాలని కొనియాడారు. బాల్య వివాహాలు నివారణ ప్రతి ఒక్కరు బాధ్యతన్నారు. అనంతరం కురుపాం గ్రామంలో నెయ్యిల వీధిలో కమ్యూనిటీ పీపులుకి చైల్డ్ మ్యారేజ్ కోసం అవగాహన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో  280 విద్యార్థినిలు,జిల్లా బాలల విభాగం ఔట్రిచ్ వర్కర్ రావాడ హరికృష్ణ,మరియు మహిళా సంరక్షణ కార్యదర్శిల స్వప్న,ఉపాధ్యాయులు,వన్ స్టాప్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలుగురాతిబంద గిరిజనులు మెచ్చేలా రహదారి నిర్మాణం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 17**:ఎలుగురాతిబంద గ్రామ గిరిజనులు మెచ్చేలా రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలుగుదేశం పార్టీ పాడేరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తెలిపారు. మండల టీడీపీ కార్యదర్శి పసుపులేటి నాగమణితో కలిసి ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. మారుమూల గ్రామమైన దేవరపల్లి పంచాయతీ పరిధిలోని ఎలుగురాతిబంద గ్రామానికి చెందిన కానిస్టేబుల్ బాబూరావు రహదారి ఏర్పాటు చేయాలని కోరిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేసిందని చెప్పారు. సాంకేతికంగా అనువైన మార్గంలో రహదారి నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ మేరకు పనులకు ప్రారంభోత్సవం నిర్వహించామని పేర్కొన్నారు. అలాగే, స్థానిక గిరిజనులు సూచించిన మార్గంలోనూ రహదారి నిర్మాణానికి అవకాశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గిరిజనులు సంతృప్తి చెందేలా, అభివృద్ధికి దోహదపడేలా రహదారులు నిర్మిస్తామని గిడ్డి ఈశ్వరి తెలిపారు.

# షర్మిలమ్మ యాత్రను జయప్రదం చేయండి



- ఉపాధిని రక్షించుకునేందుకు ఏకతాటిపైకి రావాలి
- మహాత్మా గాంధీ ఉపాధి హామీ కొనసాగించాలని పోరాడాలి
- కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి నిధులు ఇవ్వాలి.
- అంకుళ్లవలసలో ఎంజి నరేగా బచావో సంగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**గుమ్మలక్ష్మీపురం కొమరాడ,ఫిబ్రవరి 17 పెన్ పవర్.**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం రాష్ట్రంలో చేపడుతున్న ఉపాధి హామీ పరి రక్షణ యాత్రను జయప్రదం  చేయాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు,కోరారు. కురుపాం నియోజక వర్గం,కొమరాడ మండలంలోని అంకుళ్ల వలస గిరిజన గ్రామంలో ఎంజి నరేగా బచావో సంగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంగలు దాల్ నాయుడు మాట్లాడుతూ 2005లో కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వంతొలగించిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే పనిలో భాగంగా మహాత్మా గాంధీ పేరును తొలగించాటమే కాక. 90 శాతం నిధులు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం 60%నిధులకు తగ్గించిందన్నారు. 40%నిధుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై వేసిందన్నారు. దీనివలన వేతనదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని జిల్లాలో 64 వేల పనులను రద్దు చేసినట్లు తెలిసిందన్నారు. ఇప్పటికే జిల్లాలో పనులు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉపాధి శాఖ ఉంది రానున్న రోజుల్లో గ్రామీణ పేదలకు ఉపాధి పనులు కరువయ్యే ప్రమాదం ఉందని. ఉపాధి పనులు రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు పోరాడాలి దీనికోసం అందరూ ఒక్క తాటి పైకి రావాలన్నారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఉపాధి హామీపరిరక్షణ యాత్రచేపడుతున్నారన్నారు. త్వరలో ఆయాత్ర జిల్లాకు రానుంది. ఆ యాత్రలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలనన్నారు ఈ సందర్భంగా ఉపాధి హామీ ముద్దు,జి రామ్ జి వద్దని, నినాదాలు చేశారు.

# పట్టణంలో 'పింక్' టాయిలెట్ల నిర్మాణ స్థలం పరిశీలన

**జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి**



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. ఫిబ్రవరి 17** : పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో గల జిల్లా ఆసుపత్రి సమీపంలో నిర్మించతలపెట్టిన పింక్ కమ్యూనిటీ టాయిలెట్ల ప్రతిపాదిత స్థలాన్ని జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలో ముఖ్యంగా రద్దీగా ఉండే జిల్లా ఆసుపత్రి ప్రాంతానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం అత్యాధునిక వసతులతో కూడిన పింక్ టాయిలెట్లను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్ కలక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు, ప్రయాణికులకు, స్థానికులకు అందుబాటులో ఉండేలా స్థలం ఉండాలన్నారు. స్థల పరిశీలన చేసిన ఆయన అధికారులకు పలు మార్గదర్శకాలు జారీచేశారు. స్థలానికి సంబంధించిన పరిపాలనాపరమైన అనుమతులు త్వరగా పూర్తి చేసి, పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకటాపురం గ్రామంలో ఎంపిడిఓ ఆకస్మిక పర్యటన



**పారిశుధ్యంపై కఠిన హెచ్చరికలు**


**పద్మనాభం, పెన్ పవర్, ఫిబ్రవరి 17** :మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. రూపేష్ మంగళవారం వెంకటాపురం గ్రామ పంచాయ తీలో ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్య పరిస్థి తులను సమీక్షించారు. గ్రామంలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్ల పైకి చేరి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్న విషయాన్ని ఆయన గమనించారు. పర్యటన సందర్భంగా కొంతమంది గ్రామస్తులు తమ ఇళ్లలో వినియోగించిన నీటిని నేరుగా రహదా రులపైకి వదులుతున్నట్లు గుర్తించారు. ఈ విధమైన చర్యల వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఎంపిడిఓ హెచ్చరించారు. తక్షణమే ఈ విధానాన్ని మార్చుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుం టామని సంబంధిత వ్యక్తులకు స్పష్టం చేశారు.

అదేవిధంగా డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించి, రోడ్లపై నిల్వ ఉన్న నీటిని క్లియర్ చేయాలని పంచాయతీ సిబ్బంది కి ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో ఖాళీగా ఉన్న గ్రీన్ అంబాసిడర్ పోస్టును తక్షణం భర్తీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపిడిఓ ఆదేశించారు.

గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ఘనంగా శిరిడి సాయిబాబా 21 వ వార్షికోత్సవం



**కొయ్యురు, పెన్ పవర్ ఫిబ్రవరి 17**:మండల కేంద్రం సింగవరం శిరిడి సాయిబాబా ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించారు. రాజేంద్రపాలెం, సింగవరం కొయ్యూరు, కాకరపాడు మాకవరం, తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి సాయిబాబా గుడిని దర్శించుకున్నారు. మంగళవారం జరిగిన ఈ వార్షికోత్సవంలో ఉదయం నుంచి పాలాభిషేకాలు, గంధమాభిషేకాలు, హోమాలు, మండప పూజ,అశోక్ కుమార్ శర్మ, వెంకటేశ్వర శర్మ లు నిర్వహించారు. సన్నాయిమేళం వాయిద్య బృందం తమ భక్తి పాటలతో అలరించారు. మధ్యాహ్నం విశేష అన్నదానంలో సుమారు 800 మంది అన్నదానంలో పాల్గొన్నారు. సాయంత్రం బాబా వారి ఊరేగింపు అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు రామచంద్రమూర్తి, తోపాటు ఆలయ కమిటీ జలుమూరు నాగేశ్వరరావు, కందుకూరు వెంకటేశ్వరరావు తదితరులు వార్షికోత్సవ విజయవంతనికి కృషి చేశారు.

## గృహ నిర్మాణాలపై ఎంపీడీవో సమీక్షా సమావేశం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 17**:గూడెం కొత్త వీధి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు గృహ నిర్మాణ శాఖ అధికారులు మరియు సిబ్బందితో మండలంలో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను గురించి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణం వేగవంతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. నిర్మాణ పనులను మరియు బిల్లుల చెల్లింపులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ పసుపులేటి లక్ష్మీ విమల, డిప్యూటీ ఎంపీడీవో జగదీష్, గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్లు సెగ్గే సూరిబాబు,పి. చిట్టి పడాల్, సిబ్బంది అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఏకమవ్వాలి

- బాక్సైట్ జోలికొస్తే ఖబడ్దార్..!
- ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఫిబ్రవరి 17:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో బాక్సైట్ తవ్వకాలపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమవ్వాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. ప్రాంతంలో ఉన్న అపార ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను ఖండిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ మేరకు ఈ నెల 22న (ఆదివారం) ఉదయం 11.30 గంటలకు పాడేరు మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివాసీ అఖిలపక్ష రాజకీయ పార్టీలు, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, ఉద్యోగి, కార్మిక, కర్షక, మేధావులు, సామాజికవేత్తలు సమావేశానికి హాజరై భవిష్యత్ కార్యాచరణపై తమ సూచనలు అందించాలని ఎమ్మెల్యే కోరారు.

## పెదవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రల పంపిణీ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 17:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం పెదవలస గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య అధికారిణి డాక్టర్ కె. పృధ్వీషా మరియు ఆరోగ్య సిబ్బంది పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకర అలవాట్ల ప్రాముఖ్యతను వివరించి, చేతులు సక్రమంగా ఎలా కడుక్కోవాలో (హ్యాండ్‌వాష్ విధానం) ప్రాయోగికంగా చూపించారు. అనంతరం ప్రతి విద్యార్థికి 'అల్బెండాజోల్' మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, మండల విద్యాధికారి గోవింద్, ప్రభుత్వ ఉపాధ్యాయులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రెండవ రోజుకు చేరిన గ్రామీణ వైద్యుల హక్కుల మౌన దీక్షన దీక్ష

- గ్రామీణ వైద్యుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి
- గ్రామీణ వైద్యులపై దాడులనుండి రక్షణ కల్పించాలి, పారామెడికల్ శిక్షణను పునః ప్రారంభం చేయాలి
- గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కొండిశెట్టి సురేష్ బాబు డిమాండ్



**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఫిబ్రవరి 17:** గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం రాజధాని చేరిన గ్రామీణ వైద్యులు. ఈ నెల 16 న జరిగిన గ్రామీణ వైద్య జాతీయ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించి,మౌన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత కొండి శెట్టి సురేష్ బాబు నేతృత్వం వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న వైద్యులు పలు సమస్యలనుఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వము నుండి తగిన గుర్తింపు,రక్షణ, సంక్షేమం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ వైద్యుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

వైద్యుల ప్రధాన డిమాండ్లు

గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులను తక్షణం అరికట్టాలి.

ఆపివేసిన పారామెడికల్ శిక్షణను వెంటనే పునఃప్రారంభించాలి.

గ్రామీణ వైద్యులకు ఇళ్ల స్థలాలు,మంజూరు చేయాలని.జీవో నెంబర్ 465 ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ జీవనోపాధి పాలసీని అమలు చేయాలని అనుభవం ఉన్న వయోవృద్ధ వైద్యులకు పెన్షన్ ఇవ్వాలి.ఆర్టికల్ 36 ప్రకారం సీనియర్ ప్రాక్టిషనర్లను హెల్త్ ప్రొవైడర్లుగా గుర్తించి ఉపాధి కల్పించాలని ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేశారు.

ఈ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ జాతీయ అధ్యక్షులు బి.ఆర్ ఆంజనేయులు,గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నర్రా సునీత, రాష్ట్ర నాయకులు విశాఖ పట్నం నుండి జె ఏ సి రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ నాయుడు.పి లింగ రాజు. గౌరీ శంకర్ స్వామి.మార్కాపురం జిల్లా జె ఏ సి రాష్ట్ర నాయకులు సయ్యద్ మౌలాలి ఎస్ కె ఖాసీం సాహెబ్ శ్రీను,గూడూరు జె ఏ సి రాష్ట్ర నాయకులు సిహెచ్ దామోదర్ ఆర్ కోటేశ్వరరావు ఎస్ శరత్ బాబు,సుధాకర్ డి రాంబాబు పాల్గొన్నారు.

దేశ చరిత్రలో తొలిసారిగా గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం మౌన దీక్ష నిర్వహించామని నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలకు గ్రామీణ వైద్యులు వెన్నెముకలుగా ఉన్నారని, వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ దీక్షకు రాష్ట్రం నలుమూలల నుంచి గ్రామీణ వైద్యులు, మహిళా వైద్యులు, మద్దతుదారులు భారీగా హాజరై విజయవంతం చేశారు

# జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం





- విద్యార్థినులకు మందుల పంపిణీ
- విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట గంటా

**భీమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అ త్యంత ప్రాధాన్యం ఇస్తూ బడ్జెట్‌లో భారీ కేటా యింపులు చేసినట్లు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా భీమిలి బాలి కల గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యా ర్థినులకు అల్బెండజోల్ మాత్రలను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉత్తమ విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యా లను సాధించేందుకు విద్యార్థులు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచిం చారు. చదువుకున్న పాఠశాల, తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో ఉన్నత స్థానాలకు చేరాలని పిలుపుని చ్చారు.చిన్న వయసులోనే నోబెల్ బహుమతి అందుకున్న మలాలా యూసఫ్‌జాయ్ చెప్పిన ట్లు విద్యార్థిఉపాధ్యాయుడుపుస్తకంకలం ప్రపంచాన్ని మార్చగల శక్తి కలవని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుంద ని తెలిపారు.

విద్యార్థినుల వినూత్న స్వాగతం

పాఠశాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు విద్యార్థినులు స్వయంగా గీసిన చిత్రాలతో స్వాగతం పలకడం విశేషంగా నిలిచింది. తన చిత్రాలను చూసి గం టా శ్రీనివాసరావు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తమ అభిమాన నేతకు వినూత్నంగా స్వాగతం పలకాలని ఈ ప్రయత్నం చేసినట్లు విద్యార్థిని లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీష్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ పద్మావతి, భీమిలి జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పీవీ నరసింహం, కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, బి.ఆర్. బి. నాయుడు, కొప్పల రమేష్, గొలగాని నరేం ద్ర, జీరు సత్యం, పాసి నరసింగరావు, పాండ్రంగి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## బిల్ గేట్స్ ప్రశంసలతో చంద్రబాబు విజన్‌కు అంతర్జాతీయ మద్దతు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న డిజిటల్ పాలన విధానాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభిం చింది. బిల్ గేట్స్ రాష్ట్ర సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ ఆర్టీజీఎస్ ను సందర్శించి, అక్కడ అమలవుతున్న సాంకేతిక ఆధారిత పరిపాలన విధానాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ఆయన ప్రశంసలు కురిపించారు.డిజిటల్ సాంకేతికతను ప్రజల జీవితాలకు అనుసంధా నం చేస్తూ పారదర్శక, వేగవంతమైన పాలన అందించడం అభినందనీయమని బిల్ గేట్స్ పేర్కొన్నారు. రియల్ టైమ్ డేటా ఆధారంగా ప్రజా సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవడం వినూత్న నమూనా అని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో డిజిటల్ గవర్నెన్స్ విధానాలను పరిశీ లించిన తన అనుభవంలో, ప్రజాకేంద్రిత టెక్నాలజీ వినియోగంలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకంగా నిలుస్తోందన్నారు.ఆరోగ్యం, విద్య, వ్యవసా యం, విపత్తు నిర్వహణ వంటి కీలక రంగాల్లో సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తున్న విధానంపై ఆయన ఆసక్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను అభినందిస్తూ, సమగ్ర డేటా ఆధారిత విధానాలు భవిష్యత్ పాలనకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.

భారతదేశ డిజిటల్ అభివృద్ధిలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకుంటున్న చర్యలతో పాటు రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న నవీన కార్యక్రమాలు దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు.ఇక దీర్ఘకాలిక అభి వృద్ధి లక్ష్యంగా రూపొందించిన "స్వర్ణాంధ్ర 2047" విజన్ సాధనలో భాగస్వామ్యానికి తమ బిల్ & మెలిండా గేట్స్ ఫౌండేషన్ సిద్ధంగా ఉంద ని గేట్స్ వెల్లడించారు. సాంకేతికత ఆధారిత పాలన భవిష్యత్‌లో మరింత కీలక పాత్ర పో షిస్తుందని ఆయన పేర్కొన్నారు.

మొత్తంగా, రాష్ట్రంలో అమలవుతున్న డిజిటల్ పరిపాలన నమూనా అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు అందుకోవడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకార ణంగా నిలిచింది.

## సీలేరు ఉజ్వల గ్యాస్ పంపిణీలో నిర్లక్ష్యం స్థానిక సిబ్బందిపై చర్యల డిమాండ్




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 17:**కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక ప్రవేశపెట్టిన ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీలో సీలేరు గ్యాస్ గోదాం సిబ్బంది ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తోందని డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాసు ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గ్యాస్ గోదాం వద్ద ఆందోళన చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేవలం అధికార పార్టీ నాయకులను మాత్రమే ఆహ్వానించి, ప్రోటోకాల్ కూడా వ్యవహరించలేదని ఆయన అన్నారు. అంతేకాకుండా గ్యాస్ సిలిండర్లు అధిక ధరలకు అమ్ముతున్నారని దీనిపై ఉన్నత అధికారులు స్థానిక సిబ్బందిపై తగు చర్యలు తీసుకొని ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి. గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులకు మేలు జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## డిప్యూటీ వార్డెన్ పోస్టులు నియామకం ఆపండి.

గిరిజనేతర నూతన ఉపాధ్యాయలకు వార్డెన్ నియామకం నిలుపుదల చెయ్యాలి.



**అరకులోయ పెన్ పవర్ 17:**గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వార్డెన్లుగా గిరిజనేతర నూతన ఉపాధ్యాయుల బాధ్యత్లో ఆపాలనీ గిరిజన ఉద్యోగుల సంఘం శనివారం ఒక పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.పాడేరు జిల్లా పాడేరు ఐటిడిఏ గ్రాణ పరిధిలో వివిధ మండలలో 50 ఎస్.టీ . డబ్ల్యూ.ఏ. ఆశ్రమ పాఠశాలలో నూతనంగా నియమించబడిన గిరిజనేతర సెకండరీ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పాఠశాలలో డిప్యూటీ వార్డెన్ లుగా ఇవ్వమన్ని అప్పగించడం ఐటిడిఏ డిప్యూటి డైరెక్టర్ 13ఫిబ్రవరి 2026 ఆయ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయినలకు ఆదేశాలు జారీ చేయడంపై రకరకాలుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయినీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలో గ్రేడ్ 1.తెలుగు. పి ఈ టీ ఉపాధ్యాయులకు నియమించకుండా గిరిజన ఎస్.జీ. టీ లకు డిప్యూటీ వార్డెన్ ఆదేశాలు ఉన్నప్పటికి ఎందుకు కాలయాపన చేస్తున్నారో అందరికి తెలిసిన విషయమే. డిప్యూటీ వార్డన్లుగా ఆశ్రమ పాఠశాలలో కొనసాగలంటే ఉపాధ్యాయ ఉద్యోగుల సర్వీసు పరంగా కొన్ని నియమ నిబంధనలు ఉంటాయని. దీనిని పాటించకుండా నూతనంగా నియమతులైన ఉపాధ్యాయులపై వార్డెన్ కొనసాగించే సమస్యలర్ ఆదేశాలు జారీ వెనక్కు తీసుకోవలని, దీనికి తీవ్రంగా ఖండిస్తున్నా మన గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘా గిరిజన ఉద్యగం సంఘం ఒక పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు పార్టీ కమిటీల సమావేశం





**పెందుర్తి, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** రాంపురం కార్యాలయంలో పెందుర్తి మాజీ శాసనసభ్యులు మరియు నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు పార్టీ కమిటీల బలోపేతంపై నియోజకవర్గ ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మరియు అనకాపల్లి జిల్లా పరిశీలకురాలు శోభ హైమవతి హాజరై పార్టీ నిర్మాణం, శ్రేణుల సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై మార్గనిర్దేశం చేశారు.

సమావేశంలో పార్టీ గ్రామ, వార్డు స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణ, బూత్ స్థాయి కార్యకర్తల సమీకరణ, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, ప్రభుత్వ విధానాలపై అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. రాబోయే రాజకీయ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నాయకుడు బాధ్యతాయుతంగా పని చేయాలని శోభ హైమవతి పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో గ్రామ, వార్డు కమిటీల పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పార్వతీపురం జిల్లా పరిశీలకులు సర్గడం చిన అప్పలనాయుడు, రాష్ట్ర కార్యదర్శులు పైలా శ్రీనివాస్ రావు, గండి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు మరియు పరవాడ జడ్పీటీసీ పైలా సన్యాసి రాజు, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, చుక్క రామునాయుడు, జిల్లా కార్యదర్శి లుమోపాడ అప్పారావు, బంధం నాగేశ్వర, బుస అప్పలరాజు (వైస్ ఎంపీపీ, పరవాడ), వడ్డాది అప్పలరాజు, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి కాపుశెట్టి శేషుబాబు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ గొర్ల రామునాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలిశెట్టి సురేష్ రాజ్, రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి కోరాడ చందు యాదవ్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పార్టీ అధ్యక్షులు గోరపల్లి శ్రీను (పెందుర్తి), కర్రి బాబు (సబ్బవరం), కోన రామారావు (పరవాడ), వార్డు అధ్యక్షులు దాసరి సత్తిబాబు (93), రాపర్తి మాధవరావు (95), మెంతి మహేష్ (97), గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు (88), మద్ది శ్రీనివాస్ రెడ్డి (77), అప్పికొండ మహాలక్ష్మి నాయుడు (79), పూర్ణ శర్మ (85)తో పాటు చిన్నారావు, బోండా కనకరావు, అవగడ్డ శ్రీనివాస్, జగదీష్, బోరయ్య, అప్పలరాజు, నూక అప్పారావు, జతిన్ యాదవ్, సిరపురపు వాసు తదితరులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. సమావేశం చివరలో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు సంకల్పించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తే పార్టీకి భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు.

